క్లుప్తంగా

బీసీ కమిషన్ చైర్మన్‌కు గురుపౌర్ణమి వేడుకల ఆహ్వానం



మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగ నగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురు పౌర్ణమి వేడుకలు హాజరు కావాలని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌కు బుధవారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఆహ్వానం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాకారం బుచ్చయ్య, సభ్యులు జయ రామకృష్ణారావు, దూడల జనార్ధన్ గౌడ్, అనిల్ కుమార్, అర్చకులు లక్ష్మణశాస్త్రి, సనత్‌ఆచార్యులు, వెంకటాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

- కార్పొరేటర్ సబిహాబేగం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం, జలమండలి మేనేజర్ అన్వేత్

మోతీనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులను బుధవారం జలమండలి మేనేజర్ అన్వేత్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్వత్‌నగర్లో భూగర్భ డ్రైనేజీ పనులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా, నాణ్యతతో వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

నేడు బోనాల చెక్కుల పంపిణీ

కూకట్‌పల్లి: బోనాల ఉత్సవాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాలకు చెక్కులను మూసాపేట లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో గురువారం అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్ హాజరు కానున్నారు. బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, దేవాలయ ఉత్సవ నిర్వాహకులు అందరూ పాల్గొని సంబంధిత చెక్కులు అందుకోగలరని కోరారు.

నేడు రక్తదాన శిబిరం

ఆల్విన్‌కాలనీ: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు, స్వర్గీయ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమంలో భాగంగా మేరా యువభారత్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9.30 గంటలకు రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ భూదేవిహిల్స్ కాలనీలో ఏర్పాటు చేసినట్లు బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రక్తదాన శిబిరం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు యాదవ్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సేవెళ్ల మహేందర్ హాజరుకానున్నట్లు తెలిపారు. యువకులు రక్తదాన కార్యక్రమంలో పాల్గొని ప్రాణదాతలు కావాలని కోరారు.

శుభాకాంక్షలు తెలిపిన నేతలు



ఆల్విన్‌కాలనీ: ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి సవంత్సర కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రీతంకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు, సంతోష్ ముదిరాజ్‌లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాందాస్ గౌడ్



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్‌కు చెందిన పి. రాందాస్ గౌడ్ కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. తనపై నమ్మకంతో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించినందుకు కాంగ్రెస్ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

జాగ్రత్తలతో వ్యాధులు దూరం!

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- సాక్షితో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శోభ

బాలానగర్:

వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డీఎంహెచ్ఓ, బాలానగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్ శోభ అన్నారు. సాధారణంగా వర్షాకాలంలో అంటువ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయని వివరించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె పలు సూచనలు చేశారు.

- వాతావరణంలో కలిగే మార్పుల వల్ల విష జ్వరాలు వ్యాపిస్తాయి. ఫతేనగర్, బాలానగర్, డివిజన్‌ల పరిధిలో కార్మికులు, కష్టజీవుల వారు ఆరోగ్యం పట్ల వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి.
- 3 నుంచి 5 రోజుల వరకు జ్వరం ఉంటూ శరీర ఉష్ణోగ్రత 103 ఫారన్‌హీట్ డిగ్రీలు ఉంటే విష జ్వరంగా పరిగణించి అవసరమైన చికిత్స తీసుకోవాలి.
- కలుషితమైన నీరు తాగటం వల్ల టైఫాయిడ్ వస్తుంది. కావున మంచినీరు వేడి చేసి చల్లార్చిన తరువాత వడకట్టి తాగాలని సూచించారు. అదే విధంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు నిలిచే ప్రదేశాలను గుర్తించి ఆయిల్ బాల్స్‌ను మురుగునీటిలో వేయాలి.
- వర్షాకాలంలో నిమోనియా, ఆస్తమా, డయేరియా, హైపటైటీస్, టైఫాయిడ్ వంటివి ఎక్కువగా వస్తుంటాయి. ఆరోగ్యం బాగాలేనపుడు తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు తీసుకోవాలి.

శుభ్రత పాటించాలి



ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలి. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వర్షాకాలంలో వచ్చే వ్యాధులు రాకుండా ఉండటానికి ఆస్కారం ఉంటుంది. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా అందుబాటులో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్స్‌లో వైద్యం పొందాలి.

– డాక్టర్ శోభ, డిప్యూటీ డీఎంహెచ్ఓ

అందుబాటులో ఉన్న సేవలు

బాలానగర్ ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. చిన్నారులకు పోలియో, రోటా వైరస్, తట్టు వ్యాధి వంటి వ్యాధులు రాకుండా ఉచితంగా టీకాలు వేస్తాము. గర్భిణులకు టీకాలు, పరీక్షలు నిర్వహిస్తారు. వారికి అవసరమైన ఐరన్, కాల్షియం మందులను నెలవారీగా అందజేస్తామని తెలిపారు. బీపీ, మధుమేహం కేసులను పరిశీలించి అందుబాటులో ఉన్న మందులు ఇస్తారు. హెచ్‌బీ, డీఎల్‌సీ, బ్లడ్ షుగర్, బ్లడ్ యూరియాతో పాటు 54 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించి తమ ఆధార్ కార్డు కాపీని తీసుకువస్తే చాలు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ



కూకట్‌పల్లి: దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కూకట్‌పల్లి బస్టాప్ వద్ద సీఐటీయూ నాయకులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఓమ్ని ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక హక్కులను కాలరాస్తూ 44 చట్టాలను రద్దు చేసిందన్నారు. నాలుగు లేబర్ కోడ్లు తీసుకు వచ్చిందని, దీంతో కార్మికులకు కష్టాలు, యజమానులకు లాభాలు చేకూరే విధంగా ఉన్నాయన్నారు. 12 గంటల పని చేయాలని 4 లేబర్ కోడ్స్ తీసుకురావటం కార్మిక లోకానికి తీవ్ర అన్యాయం చేసినట్లేనని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.శంకర్, మండల కార్యదర్శి కె. కృష్ణ నాయక్, ధర్మారావు, యువజన నాయకులు శ్రీను నాయక్, జిల్లా అధ్యక్షులు చెన్న కేశవులు, శంకర్‌రావు, మల్లయ్య చారి, వెంకట రెడ్డి, శ్రీనివాస్, శివప్రసాద్, సత్తయ్య, పెన్షనర్స్ అసోసియేషన్ కూకట్‌పల్లి ఏరియా కమిటీ ప్రధాన కార్యదర్శి కె. శంకరరావు, ఉపాధ్యక్షులు వి. శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి కె. శంకర్‌రావు, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు చెన్నకేశవులు, మోహనరావు, రామ్ లక్ష్మి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించాలి

ఓల్డ్ బోయిన్‌పల్లి: సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామిని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్ రావు కలిసి వినతిపత్రం అందజేశారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల పడుతున్న ఇబ్బందులను వివరించారు. రిటైర్డ్ ఉద్యోగులకు రేషన్ కార్డులను అందించాలని విన్నవించారు. దీనికి స్పందించిన మంత్రి త్వరలోనే మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించుటకు సింగరేణి యాజమాన్యం తగిన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరు విషయంలో పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.



మంత్రి వివేక్ వెంకటస్వామికి సమస్యలు వివరించిన రాంచందర్

గురుపౌర్ణమి వేడుకలు

గురుపౌర్ణమిని పురస్కరించుకొని పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులు





కూకట్‌పల్లి: వివేకానందనగర్‌లోని చిత్తారమ్మ ఆలయం వద్ద సాయిబాబా దేవాలయంలో గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. గురువారం గురు పౌర్ణమి సందర్భంగా ఉదయం 7 నుంచి 9 గంటల వరకు దత్త సాయి మూలమంత్ర సహిత ఆదిత్య హృదయ స్తోత్ర హవనం, సంపూర్ణ ఆరోగ్య ప్రాప్తికి గోధుమలు, దానిమ్మ గింజలతో విశేష హోమం, దత్త సాయి మూలమంత్ర హోమం, అనంతరం సామూహిక సాయి సత్య వ్రతాలు, సహస్ర కళశాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఉంటుందని తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొని సాయినాధుని కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

విద్యార్థులను ఉపాధ్యాయులు ఉన్నతులుగా తీర్చిదిద్దాలి

- విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ విజయలక్ష్మి
- ప్రభుత్వ పాఠశాలను తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న విజయలక్ష్మి

బాలానగర్: విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. బాలానగర్ డివిజన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. పిల్లలు ఎలా చదువుతున్నారు?, మీ మాస్టర్లు పాఠాలు బాగా చెబుతున్నారా? అని అడిగారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, టెస్ట్ బుక్స్, దుస్తులు విద్యార్థులకు అందజేశారా? అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఇటీవల నిర్వహించిన విద్యార్థుల బేస్ లైన్ టెస్టులో విద్యార్థుల గ్రేడింగ్‌ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ హరిచంద్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సదుపాయాల కల్పనకు ఎల్లవేళలా కృషి

- కార్పొరేటర్ శిరీష



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శిరీష

మూసాపేట: ఆయా కాలనీల్లో సదుపాయాల కల్పనకు ఎల్లవేళలా కృషి చేస్తానని కార్పొరేటర్ శిరీష బాబురావు అన్నారు. బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని 15వ ఫేజ్‌లో డ్రైనేజీ అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం ఈ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో నిధులు మంజూరు అయ్యాయని, త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు ఎస్‌వీ రామ్ ప్రసాద్, సీహెచ్. వెంకటరాజు, పీ. జీవానందం, కె. శ్రీనివాస్, సత్యనారాయణ, స్థానిక నాయకులు భాస్కర్, సుశీల్, అనిత, అధికారులు పాల్గొన్నారు.

నేడు గురు పౌర్ణమి వేడుకలు

మోతీనగర్: పాండురంగనగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ బాకారం బుచ్చయ్య, కార్యనిర్వహణాధికారి గుమ్మడిదల సుధాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్టార్ కల్చర్ హబ్ వారి ఆధ్వర్యంలో ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని బాబా ఆశీస్సులు పొందాలని కోరారు.

అవంతి నగర్ తోటలో...

అవంతినగర్ తోట రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం సాయినాథుని అభిషేకాలు, మధ్యాహ్నం సాయి బాబా మహా హారతి అనంతరం అన్నదాన ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

కేపీహెచ్‌బీ కాలనీలో..

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీలోని రోడ్డు నంబర్2లో సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 4.30 గంటలకు కాకడ హారతి, నిత్య అర్చన, 9 గంటలకు శ్రీసాయి సామూహిక వ్రతాలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన, 6 గంటలకు సంధ్యాహారతి, పల్లకీ సేవ, రాత్రి 9 గంటలకు శేజ హారతి, తీర్థ ప్రసాద వినియోగం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

నేటి పొదుపు భావితరాలకు మలుపు



సమావేశంలో మాట్లాడుతున్న సీఓ మురళి

మోతీనగర్: నేటి పొదుపు భావితరాలకు మలుపు అని జీహెచ్ఎంసీ మూసాపేట సర్కిల్ ప్రాజెక్టు ఆఫీసర్ ఇంద్ర సేన అన్నారు. బుధవారం సర్కిల్ పరిధిలోని మూసాపేట డివిజన్ మోతీనగర్ వార్డు కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి వేడుకల్లో భాగంగా మహిళా సమైక్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన మహిళా సంఘాలు ఏర్పాటు చేయటం, వడ్డీ లేని రుణాలు, ఇందిరా మహిళా శక్తి వ్యక్తిగత రుణాలు మంజూరు గురించి క్లుప్తంగా వివరించారు. అదే విధంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

అస్వస్థతకు గురైన వారిని నిమ్స్‌కు తరలించాలి

ఆల్విన్‌కాలనీ: శంషీగూడ, హైదర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో స్థానికంగా ఉన్న కల్లు దుకాణాల్లో కల్లు తాగిన కొంతమంది అస్వస్థతకు గురై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. బాధితులు ఇంకా ఎక్కువ మంది ఉండవచ్చనే అనుమానంతో ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి సాయిచరణ్ కాలనీ, పరిసర ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. రెండు, మూడు రోజుల నుంచి కల్లు తాగి వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు ఉన్న బాధితులను గుర్తించి వారి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించారు. వారిని వెంటనే నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కల్లు తాగిన కొంతమందికి అదే రోజు ఎలాంటి అనారోగ్య లక్షణాలు లేకపోయినా, మరుసటి రోజు నుంచి వారిలో అనారోగ్య సమస్యలు బయటపడుతున్నాయని అన్నారు. వారికి బీపీ పడిపోవడం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలతో అస్వస్థతకు గురవ్వడంతో హాస్పిటల్‌కు తరలించటం జరిగిందన్నారు. లక్షణాలతో బాధపడుతున్న వారి గురించి ఎవరికైనా తెలిసిన వెంటనే కార్పొరేటర్ కార్యాలయం నెంబర్ 7680894569 ఫోన్ చేసి సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, వెంకట్ నాయక్, శివరాజ్ గౌడ్, లక్ష్మమ్మ, శివ, బాబు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఎంపీ పరామర్శ

మూసాపేట: బీఆర్ఎస్ మూసాపేట డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ మామ రాములు మృతి చెందటంతో ఆయన కుటుంబ సభ్యులను బుధవారం ఎంపీ ఈటల రాజేందర్ బుధవారం పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహేందర్, సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆస్తిపన్ను మదింపులో అక్రమాలు !

- భవన విస్తీర్ణం కొలతల్లో తేడాలు
- నగర శివారుల్లో 34 పురపాలికలు
- ఏళ్ల తరబడి సిబ్బంది జాప్యం చేస్తున్నారని ఆరోపణలు
- ఇంటి నంబర్లపై ప్రత్యేక చర్యలకు యంత్రాంగం కసరత్తు



సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివారు పురపాలక సంఘాల పరిధిలో ఏళ్లుగా ఆస్తిపన్ను ఆదాయానికి గండి పడుతోంది. దీంతో ఆదాయం లేక పురపాలికల నిర్వహణ భారంగా మారుతోంది.

కేటాయించని ఇంటి నంబర్లు..

పలు ప్రభుత్వ కార్యాలయాల భవనాలు, వందలాది ప్రైవేట్ భవనాలు, అపార్టుమెంట్లు, వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు, హాస్టళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు తదితర వాటికి ఏళ్ల తరబడి ఇంటి నెంబర్లు కేటాయించకపోవడంతో ఆస్తిపన్నుకు భారీగా గండి పడుతుందని ఆ శాఖ అధికారులు రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదికలు అందించడం గమనార్హం.

ఖజానాకు జమకాని నిధులు

ఈ పరిణామం పురపాలికలు, పంచాయతీల్లో రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది పనితీరుకు అద్దం పడుతోంది. లక్ష్యాలకు అనుగుణంగా పన్నుల వసూళ్లలో అలసత్వం వహిస్తుండటంతో కూడా ఖజానాలో నిధులు జమకావడం లేదు.

మదింపులో అక్రమాలు..

నగర శివారుల్లో 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 27 మున్సిపాలిటీలు, మొత్తంగా 34 పురపాలక సంఘాలు ఉన్నాయి. ఇందులో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 12 మున్సిపాలిటీలు ఉండగా.. రంగారెడ్డి జిల్లా పరిధిలో 3 మున్సిపల్ కార్పొరేషన్లు, 15 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో దాదాపు 2, 3 పురపాలక సంఘాలు మినహా మిగతా వాటిల్లో ఆస్తిపన్ను మదింపులో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలున్నాయి.

మదింపుల్లో తేడాలు

బోడుప్పల్,జవహర్‌నగర్,బడంగ్‌పేట,మీర్‌పేట,నిజాంపేట్, ఘట్కేసర్, నాగారం, పోచారం, దమ్మాయిగూడ, కొంపెల్లి, మేడ్చల్, తూముకుంట, ఎల్లంపేట్, అలియాబాద్, మూడుచింతలపల్లి తదితర పురపాలక సంఘాలతో పాటు రంగారెడ్డి జిల్లాలోని పలు పురపాలక సంఘాల్లో కూడా ఆస్తిపన్ను మదింపుల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. సంబంధిత ఉన్నతాధికారుల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పన్నుల మదింపు, ఇంటి నంబర్ల కేటాయింపుల్లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

నిబంధనలు బేఖాతరు

భవనాల యజమానులతో పలువురు ఉద్యోగులు కుమ్మక్కై చేతివాటంతో నిబంధనలు బేఖాతరు చేస్తూ.. తక్కువ ఆస్తిపన్ను మదింపు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాణిజ్య భవనాలను నివాసభవనాలుగా, అనుమతులు లేని వాటికి, అదనపు అంతస్తులకు పన్ను మదించకుండా, కొద్దిపాటిగా విధిస్తున్నట్లు కొందరు చెబుతున్నారు.

భవనాల విస్తీర్ణంలో తేడాలు

విద్యాసంస్థలు ప్రస్తుతం చెల్లిస్తున్న ఆస్తిపన్ను, భవనాల విస్తీర్ణంపై ఉన్న తేడాలను పరిశీలిస్తే.. పన్ను ఎగవేస్తున్న విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో పురపాలక సంఘాలు, గ్రామపంచాయతీల్లో అనుమానం ఉన్న భవనాల కొలతలు తీయాలని నిర్ణయించినట్లు సమాచారం.

- నగర శివారుల్లోని పలు పురపాలికల్లో భవనాలతో పాటు అపార్ట్‌మెంట్లలోని ఇంటిపన్ను మదించని వాటిని సిబ్బంది గుర్తించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా పురపాలిక సంఘాలు ,గ్రామ పంచాయతీల ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

ఆస్తిపన్ను తక్కువగా..

ఆస్తిపన్ను తక్కువగా మదించారన్న అనుమానం ఉన్న భవన నిర్మాణాలకు తిరిగి కొలతలు తీసి నిబంధనల మేరకు పన్ను విధించేలా చర్యలకు ఉపక్రమించాలని పురపాలక అధికారులు ప్రణాళిక చేస్తున్నారు. వీటిపై ఏళ్లుగా దృష్టి పెట్టకపోవడంతో గణనీయంగా ఆదాయం కోల్పోతున్నామనే విషయాన్ని వారు గ్రహించినట్లు సమాచారం.

- దశలవారీగా భవనాల ఆస్తిపన్నును సవరించాలని భావిస్తున్నారు. గత వ్యత్యాసాలను గుర్తించిన పన్నును ఈ ఆర్థిక సంవత్సరం నుంచి వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో భవనాలకు తీసిన కొలతలు, మదించిన పన్నుపై అనుమానం ఉన్న పక్షంలో యాజమానులు పురపాలక సంఘాల దృష్టికి తీసుకురావాలని కోరుతున్నారు.